క్లుప్తంగా

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం అర్బన్: ఈనెల 4న ఎన్టీఆర్ సర్కిల్‌లోని నేత్రాలయ ఐ క్లినిక్‌లో నిర్వహించనున్న కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్ కోరారు. పట్టణంలోని స్వాతిక్లినిక్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను యువర్స్ ఫౌండేషన్ సభ్యులు విడుదల చేశారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులచే కంటిచూపు తగ్గిన వారికి కంటి పరీక్ష చేస్తారన్నారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు చాంద్‌బాషా, బీఆర్ రంగనాథ్, రాధాకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పోలా రామాంజనేయులు వర్ధంతి

ధర్మవరం: ఎన్జీఓ హోంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఏపీ చేనేత కార్మిక సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు మొదటి వర్ధంతి నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నేతలు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, ఎల్.ఆదినారాయణ, వెంకటస్వామి, హరి తెలిపారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లలమర్రి బాలకృష్ణ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, ప్రజలు, మేధావులు, చేనేత కార్మికులు పాల్గొనాలని కోరారు.

పెద్దమ్మ, గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


పూజలందుకున్న పెద్దమ్మ, గంగమ్మతల్లి

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఎగువగేరి పెద్దమ్మతల్లి, ఈదులపల్లి గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో జరిగింది. వేదపండితుడు అప్పరాచెరువు ఫణీంద్రస్వామి బృందం తెల్లవారుజాము నుంచి పూజలు చేపట్టారు. ఉదయం 9 గంటలకు పెద్దమ్మతల్లి, గంగమ్మతల్లి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. గ్రామపెద్దలు, ఆలయ అర్చకులు పూజారి గంగాధర్, మీనాక్షి, సహాయకులు బత్తల నరసమ్మ, బత్తల వీరనారప్ప, బత్తల మల్లిఖార్జున, పసలూరు కాటమయ్య, పర్వతదేవరపల్లి మల్లేసు, శ్రీరాములు, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

నల్లమాడ: వంకరకుంట గ్రామానికి చెందిన రైతు ఇడుగూరి రమణారెడ్డి (55) శనివారం చారుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ఆదివారం వంకరకుంటకు వెళ్లి రమణారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఓబిరెడ్డి, అరవిందరెడ్డి, కే. ఓబిరెడ్డి, కేశప్ప, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన నాగప్ప

అమరాపురం: చిట నడకు గ్రామానికి చెందిన నాగప్ప బైక్‌పై నుంచి పడటంతో తీవ్ర గాయలయ్యాయి. వివరాలు.. నాగప్ప మడకశిరలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. హనుమంతనపల్లి వద్ద కుక్కలు అడ్డు రావడంతో బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాల పాలైన అతడిని స్థానికులు 108 వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో హరిద్రాభిషేకం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంచామృతాభిషేకాలు, శత సర్పసూక్త హరిద్రాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకుపూజ, అర్చన, మహా నైవేద్యం, మహా మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు.

సస్యరక్షణే పంటకు ప్రాణం

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తలుపుల: నీటి అనుకూలత గల గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ సమయంలో సస్యరక్షణ చర్యలే కీలకం. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి, వ్యవసాయాధికారుల సూచనలు పాటించి నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. వరిపంటకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, పోషక లోపాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి మండల వ్యవసాయాధికారి షాదాబ్ రైతులకు తెలియజేశారు. కదిరి వ్యవసాయ డివిజన్లో 1,324 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 758 హెక్టార్లలో సాగైనట్లు వెల్లడించారు.

■ఆకుముడత తెగులు

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినేయడం వల్ల ఆకులు తెల్లబడతాయి. పిలక దశలో పంటకు అడ్డంగా తాడుతో 2, 3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. వీటి నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారి చేయాలి.




వరిపంట పరిశీలిస్తున్న ఏఓ

■సుడిదోమ

వరి పంట నాటిన దశనుండి చిరు పట్ట దశ కొచ్చే వరకు సుడిదోమ వచ్చే అవకాశం ఉంది. గోధుమ రంగు దోమలు దుబ్బులు అడుగున నీటి మట్టలపై ఉండి మొక్క రసాన్ని పీల్చుతాయి. దీనివల్ల పైరు సుడులు తిరిగి ఎండిపోతుంది. సుడిదోమ వ్యాపిస్తే వరి పొలంలో దోమ ఉధృతి ఉన్న చోట పంట ఎండిపోతుంది. నాట్లు చేసేటపుడు ప్రతి రెండు మీటర్లకు ఒక చోట 20 సెంటీ మీటర్ల వెడల్పుతో బాటలు వదలాలి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. పొలం గట్లపై కలుపు నివారణ చేపట్టాలి.

■ఆకు ఎండు, పాము పొడ తెగుల నివారణ

బ్యాక్టీరియా వల్ల ఆకులకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ మోతాదులో ఎక్కువసార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి. చేను దుబ్బు దశలో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. నివారణకు ఒక మిల్లీ లీటర్ ప్రొపికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

కాండం తొలుచు పురుగు

నారుమడి నుంచి పూత దశ వరకు వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వు చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. నివారణకు కార్బన్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు కలిపి తగినంత మోతాదులో పిచికారి చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు 10 కిలోలు వాడాలి.

■పొట్టకుళ్లు తెగులు

ఆకుతొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. లోపలి కాండానికి విస్తరించి కణుపుల మధ్య భాగమంతా నల్లగా మారిపోతుంది, కాండం చీల్చి చూస్తే నల్లని శిలీంధ్రాల బీజాలు కనిపిస్తాయి. వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. నివారించేందుకు కార్బన్‌డైజమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తరువాత రెండోసారి పిచికారి చేసుకోవాలి.

■తుప్పు తెగులు (జింక్ లోపం)

నేలలో జింకు లోపం ఉన్నప్పుడు పంటను తుప్పు తెగులు ఆశిస్తుంది. నాట్లు వేసిన 2 నుంచి 6 వారాల్లో ఆకు చివర ఈనెలకు ఇరువైపులా తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు చిన్నవిగా పెలుసుగా మారిపోయి వాటిని వంగగానే విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పంటలో 3, 4 ఆకులతో ఈనె రాలిపోతుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం వారం రోజుల వ్యవధిలో రెండు లేక మూడుసార్లు తగిన మోతాదులో పిచికారి చేసుకోవాలి.

■ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 6 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

■నీటి యాజమాన్యం

వరి పిలకలు వేసే దశలో పైరుకు దుబ్బు చేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తరువాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఓపీఎస్ అమలుకు ఆందోళన

ధర్మవరం అర్బన్: పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ చీకటి దినంగా అభివర్ణిస్తూ ఆదివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పేరుతో మభ్యపెడుతోందని వాపోయారు. భవిష్యత్తులో జెడ్‌పీఎస్(జీరో పెన్షన్ విధానం) తెస్తారేమోనని ఎద్దేవా చేశారు. జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. మున్సిపల్ పాఠశాల వ్యవస్థకు ప్రతిబంధకమైన జీఓ 84ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు బలరాముడు, పట్టణ నాయకులు ఈశ్వరయ్య, శివానంద, వాసుకుమార్, కృష్ణమూర్తి, శంకర్‌నారాయణ, నాగప్ప, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని టీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్‌తో ఎలాంటి ప్రయోజనం లేదని విమర్శించారు. ఈ సెప్టెంబర్ 1తో సీపీఎస్ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీని విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. మండల టీడీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్ నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు


కదిరి జెడ్పీ హైస్కూల్ ముందు నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కదిరి అర్బన్: యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక జిల్లా పరిషత్‌బాలికల ఉన్నత పాఠశాల ముందు ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఎస్‌తో ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. తమకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తమకు పాత పెన్షన్ విధానం అమలు చేసేదాకా పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీటీఎఫ్ నాయకులు నారాయణ, సోమశేఖర్, జనార్దన్, శ్రీనివాసులు, రమణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నల్లమాడ: తుపాన్ కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రంగనాయకులు సూచించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తుపానుపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సచివాలయాల సిబ్బంది గ్రామస్థాయిలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్, మండల పరిషత్ కార్యాలయ ఏఓ రామచంద్రారెడ్డి, ఏఎస్ఐ సూర్యనారాయణ, చిన్న నీటి పారుదల శాఖ ఇంజనీర్ అనీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శశికళ, పంచాయితీ రాజ్ ఇంజనీర్ గుప్త, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీ సురేష్‌బాబు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్లలోపున్నవారు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందని, ఉద్యోగాల ఎంపికైనవారు శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లా, హైదరాబాద్, బెంగళూరులో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకురావాలన్నారు. వివరాలకు 9182288465 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగిన 'సత్యసాయి' కార్మికుల సమ్మె


నిరసన తెలియజేస్తున్న కార్మికులు

తాడిమర్రి: తమ సమస్యలు తీర్చాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు 11 వ రోజు ఆదివారం సమ్మె కొనసాగించారు. స్థానిక మద్దులచెర్వు సత్యసాయి తాగునీటి సంపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, నాలుగేళ్లుగా బోనస్ అందలేదన్నారు. తమ సమస్యలపై 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా అధికారులు స్పందించక పోవడం శోచనీయమన్నారు. కార్మికులు కే.పెద్దఓబిలేసు, టీ.లక్ష్మీనారాయణ, పీ.తిరుపాలు, ఏ.నాగార్జున, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు


ఆస్పత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న అచ్చమ్మ


కదిరి ప్రభుత్వాస్పత్రిలో క్యూకట్టిన రోగులు

- వార్డుల్లో పడకేసిన పారిశుధ్యం
- తూతూ మంత్రంగా ఫాగింగ్

కదిరి టౌన్: అసలే వర్షాకాలం. ఆపై పారిశుధ్యం పడకేయడంతో పట్టణంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణంలోని పలువార్డుల్లో పారిశుధ్యం లోపించడంతో దోమలు అధికమై ప్రజలు మలేరియా, డెంగీ, చికున్‌గన్యాతోపాటు విషజ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే వార్డులో చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు మురుగుకాలువలు శుభ్రం చేయడం లేదు. దోమలు బెడద ఎక్కువై ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. తూతూమంత్రంగా ఫాగింగ్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కిక్కిరుస్తున్న ఆస్పత్రులు

విష జ్వరాలు విజృంభిస్తుండటంతో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిక్కిరుస్తున్నాయి. కదిరి ప్రభుత్వాస్పత్రికి రోజూ 500 నుంచి 600 మంది దాకా రోగులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువ మంది జ్వరపీడితులు ఉన్నట్లు సమాచారం. నల్లచెరువు మండలం బాలేపల్లితాండా నుంచి సీతమ్మ, అమడగూరు మండలం కంచరగానిపల్లి చెందిన అచ్చమ్మ, ఓడీచెరువు మండలం డబురువారిపల్లికి చెందిన చిన్నారి సోహిత్ 4 రోజుల నుంచి జ్వరాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులు పారిశుధ్యంతోపాటు సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కదిరిలోని ఓ వార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య ప్రజలకు సూచించారు. ఆదివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. తడి చేతులతో స్టార్టర్లు, మోటార్లు, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైనుకు చెట్టు కొమ్మలు తాకుతుంటే సంబంధిత అధికారికి తెలియజేయాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓనం పూజ


ఓనం పూజ చేస్తున్న గురుస్వామి అంబటి సతీష్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్టవద్ద నున్న అయ్యప్పస్వామి భజన మందిరంలో ఆదివారం ఓనం గురుస్వామి అంబటి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఓనం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి చిత్రపటాలను ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు.

అ'పూర్వ' కలయిక


సమావేశమైన పూర్వ విద్యార్థులు

అమడగూరు: అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2012 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం చౌడేశ్వరీ కల్యాణమండపంలో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు ఖాసీంఖాన్, ప్రభాకర్ రెడ్డి, అక్తర్‌జాను, మహేష్‌రెడ్డి, సుధీర్, రవికుమార్, యజాజ్‌ఖాన్, వేమనారాయణ, శ్రీరామ్ నాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: గణేష్ ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రోడ్లపైన విగ్రహం ప్రతిష్ఠించకూడదన్నారు. వినాయకుని విగ్రహం ప్రతిష్ఠించేందుకు కమిటీని ఏర్పాటు చేసి, వారి పేర్లను స్టేషన్‌లో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు లౌడ్‌స్పీకర్ ఏర్పాటు చేసుకోవడానికి చుట్టుపక్కల నివసించే వారి నుంచి సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. వినాయక నిమజ్జనం తేదీ, సమయం, ఏ రూట్‌లో ఊరేగింపు వెళుతుంది, వాహనం, వినాయకుని ఎత్తు, బరువు ఎక్కడ నిమజ్జనం చేస్తారో ముందుగానే తెలపాల్సి ఉంటుందన్నారు.

ఆత్మహత్యాయత్నం

అమడగూరు: మండలంలోని కొట్టువారిపల్లికి చెందిన నాగభూషణం ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేడు వైఎస్సార్ వర్ధంతి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు న్యామద్దెల సర్కిల్‌లో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు.

బత్తలపల్లి/ గాండ్లపెంట/ నల్లమాడ/అమడగూరు/ పుట్టపర్తి/తలుపుల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం బత్తలపల్లి, గాండ్లపెంట, నల్లమాడ, అమడగూరు, బుక్కపట్నం మండల కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల నేతలు కోటి సురేష్, బగ్గిరి బయపరెడ్డి, గజ్జల రవీంద్రారెడ్డి, కే. సూర్యనారాయణ, సూర్యనారాయణరెడ్డి, ఫయాజ్ అహమ్మద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


వ్యవసాయ పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలోని ఒక వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకంగా ఉన్నాయి. గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న నారాయణరెడ్డి పొలంలో విద్యుత్ స్థంభాలు సరిగా లేకపోవడంతో తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో రైతులు విద్యుత్ తీగలు నేలపై పడకుండా కట్టెలపైనే లాగారు. కాని గాలి, వాన వచ్చినప్పుడు కట్టెలు విరిగి తీగలు కిందకు పడిపోతుండటంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. సమీప పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి పొలాల్లో స్థంభాలు ఏర్పాటు చేసి తీగలు కిందకు వేలాడకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి

కదిరి టౌన్: ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోజురోజుకు నిత్యావసర వస్తువులు ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం వాటిని కట్టడి చేయాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, రేషన్ షాప్‌ల ద్వారా 7 రకాల సరుకులు పంపిణీ చేయాలన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలనే డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 6వ తేదీవరకు దేశ వ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


మామ్‌సాబ్ దంపతులను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

గాండ్లపెంట: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని శ్రీసత్యసాయి జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి పద్మమ్మ అన్నారు. పట్టుపరిశ్రమశాఖ టెక్నికల్ అసిస్టెంట్ సయ్యద్ ఇమాంసాబ్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం ఆయన్ను తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. పట్టుపరిశ్రమశాఖ ఏడీ గీత, ఏఎడీ రామక్రిష్ణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నీరుకుంట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు రుక్మాంగద ఉద్యోగ విరమణ చేయడంతో పాఠశాల హెచ్ఎం అప్పిరెడ్డి, ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు.

పోతలయ్య స్వామికి పూజలు

కనగానపల్లి: దాదులూరులో వెలసిన పోతలయ్య స్వామికి ఆదివారం భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ ఆలయానికి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి బోనాలు సమర్పించారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు స్వామిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు.